

గప్‌చుప్

నిన్నమొన్నటిదాకా ప్రచారాల హోరుతో సందడిగా ఉన్న గ్రామాల్లో పోలింగ్ అనంతరం ఒక్కసారిగా నిశ్శబ్దం అలముకుంది. 8లో▸



ఊరెళ్లలో పులి సంచారం?

చేవెళ్ల మండల పరిధిలో పులి సంచరిస్తోందని, ఓ వ్యక్తి చూశాడని సోషల్ మీడియాలో పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. 8లో▸



చేవెళ్లలో 74.18 శాతం

చేవెళ్ల నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల కంటే పోలింగ్ శాతం తగ్గడం అభ్యర్థులను కలవరపరుస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్: ఎయిడ్స్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ ఒక వైరస్ అని, ఇది మానవ శరీరంలో రోగనిరోధక శక్తిని తగ్గిస్తుందని అన్నారు. తద్వారా ఎడతెగని జ్వరం, దగ్గు, విరోచనాలు, చర్మ వ్యాధులు సంక్రమిస్తాయని అన్నారు. ఇలాంటి వ్యాధులు తీవ్ర స్థాయికి చేరుకున్న దశను ఎయిడ్స్ అంటారని అన్నారు. సూదులు, సిరంజీలు ఎల్లప్పుడూ కొత్త వాటిని మాత్రమే వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, శ్రీహరి, పుష్ప, శ్యాంసుందర్, అశోక్, మాధవి, యూన్సీ, శ్రీలత, శ్రీశైలం, అన్వర్, శ్రీధర్‌రెడ్డి, రవి, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌కు రాతి శిల్పాలు

కొడంగల్: పట్టణంలోని శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం కోసం తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి నుంచి రాతి శిల్పాలు శుక్రవారం వచ్చాయి. వాటికి మాల ధారులు పూజలు చేసి క్రేన్ సాయంతో కిందకు దింపారు. అయ్యప్ప సేవా సమితి, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రాయాదవ్, ఉమాపతి గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కిషన్ ధాగ, జగదీశ్ కుమార్ తదితరులు ఆలయం వద్ద శిల్పాలను పరిశీలించారు.

14,11,216 మంది

జిల్లాలో ఓటింగ్‌కు దూరం

- నమోదైన ఓటింగ్ శాతం 59.94
- మొత్తం ఓటర్లు 35,22,420 మంది
- ఓటు వేసిన వారు 21,11,204 మంది
- బూత్‌ల వారీగా ఓటింగ్ సరళిపై అభ్యర్థుల ఆరా



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో ఓటింగ్‌కు 14,11,216 మంది దూరంగా ఉన్నారు. వీరిలో 7,36,931 మంది పురుషులు ఉండగా, 6,73,897 మంది మహిళలు ఉన్నారు. ఇక 388 మంది ఇతరులు ఉండటం విశేషం. కొంత మంది ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయక పోవడంతో రెండు చోట్ల ఓటు హక్కును కలిగి ఉన్నారు. తీరా ఓటింగ్ సమయానికి వీరంతా సొంతూళ్లకు పయనమయ్యారు. మిగిలిన వారు నిరాసక్తత, బద్ధకం, ఇతర కారణాలతో ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లాలో ఓటింగ్ శాతం తగ్గుముఖం పట్టడానికి కారణమైంది. 2018లో జిల్లా వ్యాప్తంగా 62 శాతం ఓటింగ్ నమోదై తే.. ప్రస్తుతం 59.94 శాతం మాత్రమే నమోదైంది. నిజానికి గ్రామీణ ప్రాంత ఓటర్లతో పోలిస్తే పట్టణ ప్రాంత ఓటర్లకు ఓటింగ్‌పై కొంత అవగాహన ఎక్కువ. కానీ మెజార్టీ ఓటర్లు ఓటును హక్కుగా భావించారే కానీ బాధ్యతగా ఫీల్ కాలేదు.

ఓటింగ్ సరళిపై అభ్యర్థుల ఆరా

ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం తమకు భారీగా ఓట్లు వస్తాయని భావించారు. ఎన్నికల ప్రచారం, ఆత్మీయ సమ్మేళనాలు, పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా విపరీతంగా ఖర్చు చేశారు. తీరా ఆశించిన స్థాయిలో ఓటింగ్ నమోదు కాకపోవడంతో ఆయా పార్టీల అభ్యర్థులు తలపట్టుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా చేసిన ఎన్నికల ఖర్చు.. నమోదైన ఓటింగ్ శాతంపై ఆరా తీస్తున్నారు. సంస్థాగతంగా పార్టీకి గట్టిపట్టు ఉంద నుకున్న ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో ఓటింగ్ నమోదు కాకపోవడం, ఇతర ప్రాంతాల్లో అనూహ్యంగా ఓటింగ్‌శాతం పెరగడం అభ్యర్థుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పోల్‌మేనేజ్‌మెంట్‌లో భాగంగా కార్యకర్తల ద్వారా పంచిన నగదు, మద్యం అసలు ఓటర్లకు చేరిందా? లేదా అనే అంశాలపై కాకుండా వెంట తిరిగిన వారిలో వెన్నుపోటు పొడించిదెవరు అనే అంశంపై కూడా ఆరా తీస్తున్నారు.

నాలుగు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు

ఆదివారం ఉదయం ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎల్బీనగర్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో చేపట్టనున్నారు. ఇక షాద్‌నగర్, రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ అప్పా జంక్షన్ సమీపంలోని లార్డ్స్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో చేపట్టనున్నారు. అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉన్న షాద్‌నగర్ ఓట్ల లెక్కింపు కోసం 12 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, కల్వకుర్తి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్ల చొప్పున, అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి ఓట్ల లెక్కింపు కోసం 28 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు మొదలవుతుంది. తొలి ఫలితం మధ్యాహ్నం 12 గంటల లోపు అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉన్న చేవెళ్ల నియోజకవర్గానిది వెలువడే అవకాశం ఉంది. సాయంత్రం 4 గంటల లోపు తుది ఫలితం వెలువడే అవకాశం లేకపోలేదు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఇబ్రహీంపట్నం, చేవెళ్ల కౌంటింగ్ కేంద్రాల్లో ఆరు టేబుళ్ల చొప్పున, ఎల్బీనగర్‌లో పది, మహేశ్వరం, రాజేంద్రనగర్‌లో ఎనిమిది చొప్పున, శేరిలింగంపల్లిలో ఏడు, కల్వకుర్తిలో రెండు, షాద్‌నగర్‌లో నాలుగు టేబుళ్ల చొప్పున సిద్ధం చేశారు.

ఓటింగ్ తీరు ఇలా ..

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు
పురుషులు	18,22,366	10,85,435
మహిళలు	16,99,600	10,25,703
ఇతరులు	454	66
మొత్తం	35,22,420	21,11,204

నియోజకవర్గాల వారీగా ఓటింగ్ సరళి

ఇబ్రహీంపట్నం (ఓటింగ్ శాతం-74.93)

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు
పురుషులు	1,65,760	1,23,968
మహిళలు	1,61,786	1,21,483
థర్డ్‌జెండర్స్	37	8
మొత్తం	3,27,583	2,45,459

ఎల్బీనగర్ (ఓటింగ్ శాతం-49.07)

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు
పురుషులు	3,09,557	1,49,827
మహిళలు	2,84,024	1,41,492
థర్డ్‌జెండర్స్	131	28
మొత్తం	5,93,712	2,91,347

మహేశ్వరం (ఓటింగ్ శాతం -55.39)

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు
పురుషులు	2,81,203	1,54,746
మహిళలు	2,65,307	1,48,010
థర్డ్‌జెండర్స్	67	6
మొత్తం	5,46,577	3,02,762

రాజేంద్రనగర్ (ఓటింగ్‌శాతం-55.83)

కేటగిరీ	మొత్తం ఓటరు	ఓటు వేసిన వారు
పురుషులు	3,02,995	1,68,996
మహిళలు	2,78,898	1,55,920
థర్డ్‌జెండర్స్	44	1
మొత్తం	5,81,937	3,24,917

శేరిలింగంపల్లి (ఓటింగ్‌శాతం-48.75)

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు
పురుషులు	3,88,482	1,86,877
మహిళలు	3,43,875	1,70,175
థర్డ్‌జెండర్స్	149	22
మొత్తం	7,32,506	3,57,074

చేవెళ్ల (ఓటింగ్‌శాతం -74.18)

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు
పురుషులు	1,32,631	99,705
మహిళలు	1,29,370	94,638
థర్డ్‌జెండర్స్	4	-
మొత్తం	2,62,005	1,94,343

కల్వకుర్తి (ఓటింగ్‌శాతం-83.26)

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు
పురుషులు	1,22,693	1,02,739
మహిళలు	1,19,062	98,546
థర్డ్‌జెండర్స్	7	-
మొత్తం	2,41,762	2,01,285

షాద్‌నగర్ (ఓటింగ్‌శాతం -82.09)

కేటగిరీ	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు
పురుషులు	1,19,045	98,577
మహిళలు	1,17,278	95,439
థర్డ్‌జెండర్స్	15	1
మొత్తం	2,36,338	1,94,017

లిక్కర్.. నయా సాల్!

కొలువుదీరిన కొత్త మద్యం దుకాణాలు

- గ్రేటర్‌లో 615 వైన్ షాపులకు అనుమతులు
- ఎన్నికల దృష్ట్యా ముందస్తుగానే లైసెన్సులు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో కొత్త మద్యం దుకాణాలకు ఆబ్కారీ శాఖ అనుమతులు ఇచ్చింది. శుక్రవారం కొత్త దుకాణాలు ప్రారంభమయ్యాయి. గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో కొత్తగా 615 వైన్స్ షాపులకు ఎక్సైజ్ శాఖ గత ఆగస్టులో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల దృష్ట్యా ముందస్తుగానే నోటిఫికేషన్ వెలువడటంతో వ్యాపారుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. అనేక చోట్ల పెద్ద ఎత్తున పోటీకి దిగారు. ఒక్కో మద్యం దుకాణానికి ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున ఫీజు విధించింది. ఒక వ్యాపారి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండడంతో భారీ సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో కేవలం 100 దుకాణాలకు 9,080 మంది పోటీపడ్డారు. సరూర్‌నగర్‌లో 134 దుకాణాలకు 9012 దరఖాస్తులు వచ్చాయి.

రూ.650 కోట్ల ఆదాయం..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 615 దుకాణాలపై లైసెన్సు ఫీజుల రూపంలోనే ప్రభుత్వానికి ఏకంగా రూ.650 కోట్ల వరకు ఆదాయం లభించినట్లు అంచనా. నగరంలోని దుకాణాల కంటే శివారు ప్రాంతాల్లోని మద్యం షాపుల కోసమే వ్యాపారులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్, శంషాబాద్, శేర్‌లింగంపల్లి, ఉప్పల్, మేడిపల్లి, కీసర, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో భారీ డిమాండ్ కనిపించింది. ఆగస్టులో 16వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే నెల చివరిలో డ్రా తీశారు. నిబంధనల మేరకు కొత్త వైన్ షాపులకు లైసెన్సుల ప్రక్రియ చేపట్టారు.

మూడు నెలల ముందే అనుమతి..

సాధారణంగా ప్రతి రెండేళ్లకోసారి మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్సులను అందజేస్తోంది. ఒకసారి లైసెన్సు పొందిన వ్యాపారి రెండేళ్ల పాటు దుకాణం నిర్వహించవచ్చు. రెండేళ్లకోసారి అక్టోబర్ నెలాఖరులో నోటిఫికేషన్ విడుదల చేసి నవంబర్‌లో అనుమతులను ఇస్తారు. అదే నెలలో మొత్తం ఫీజులో నాలుగో వంతు చెల్లించిన వారికి డిసెంబర్ ఒకటో తేదీ నాటికి దుకాణాలకు లిక్కర్ చేరుతుంది. కాగా.. ఈ ఏడాది ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆగస్టులోనే ఈ ప్రక్రియను చేపట్టడంతో సెప్టెంబర్‌లో ఫీజులు చెల్లించిన వ్యాపారులు కొత్త దుకాణాలను ప్రారంభించేందుకు డిసెంబర్ వరకు ఆగాల్సి వచ్చింది. రూ.లక్షల్లో ఫీజులు చెల్లించడం వల్ల ఈ మూడు నెలల పాటు భారీ మొత్తంలో వడ్డీ చెల్లించాల్సివచ్చిందని పలువురు విస్మయం వ్యక్తం చేశారు.మరోవైపు అన్ని కొత్త షాపులకు నవంబర్ 30 నాటికే మద్యం చేరాల్సి ఉండగా..ఎన్నికల దృష్ట్యా డిసెంబర్ ఒకటో తేదీ శుక్రవారం ఉదయం నుంచే మద్యం సరఫరా కావడంతో కొన్ని చోట్ల సాయంత్రం వరకు కొత్త షాపులు తెరుచుకున్నాయి.

మీ సేవలు అపురూపం

- మీ పని తీరు అభినందనీయం
- పోలీసులకు బహుమతులు అందించిన కొత్వాల్



సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం, పక్షపాతం చూపించిన వారిపై వేటు వేసిన నగర కొత్వాల్ సందీప్ శాండిల్య.. ఉత్తమ పని తీరు కనబరిచిన వారిని గుర్తించి అభినందించారు. గురువారం పోలింగ్ నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు తమవంతుగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని శుక్రవారం ఆయన అభినందించారు. షాహినాయత్‌గంజ్ ఠాణా సరిహద్దు ప్రాంతంలో కొందరు రాజకీయ పార్టీలకు చెందిన పురుషులు, మహిళలు గొడవలు పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మంగళ్‌హాట్ ఠాణా ఎస్సై జి.అంబిక గుర్తించారు. తక్షణం అప్రమత్తమైన ఈమె షాహినాయత్‌గంజ్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు వచ్చిన సిబ్బందితో కలిసి ఆమె కూడా గుంపును చెదరగొట్టారు. హబీబ్ నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని పోలింగ్ బూత్‌లో బోగస్ ఓట్లు వేయడానికి వచ్చిన కొంత మందిని నిలువరించి, వారిని సంబంధిత ఠాణాకు అప్పగించి కేసు నమోదు చేయించడంలో సిటీ సెక్యూరిటీ వింగ్ కానిస్టేబుల్ వినయ్ కుమార్ కీలకపాత్ర పోషించారు. ఫలక్‌నుమా ఠాణా మహిళా కానిస్టేబుల్ కృష్ణకుమారి భోంస్లే కాలాపత్తర్ పరిధిలోని పోలింగ్ బూత్‌లో విధులు నిర్వర్తించారు. అక్కడ బోగస్ ఓట్లు వేయడానికి వచ్చిన కొందరు వ్యక్తుల్ని అడ్డుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ ముగ్గురినీ శుక్రవారం ఐసీసీసీలోని కమిషనరేట్‌కు పిలిపించిన కొత్వాల్ సందీప్ శాండిల్య అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అదనపు సీపీ (శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్, సంయుక్త సీపీ (ఎస్బీ) పి.విశ్వ ప్రసాద్ సైతం పాల్గొన్నారు.



ఆమనగల్లు: పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి



చేవెళ్ల: ఓటింగ్ సరళిపై చర్చిస్తున్న చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్

పోరు ముగిసింది.. తీరిక దొరికింది

వేకువజామున లేచింది మొదలు రాత్రి పొద్దుపోయేవరకు ఎత్తుకు పైఎత్తులు.. ప్రణాళికలు.. లెక్కలు.. పోల్‌మేనేజ్‌మెంట్.. అనుచరులతో మంతనాలు.. ఉరుకులు.. పరుగులు.. పోటాపోటీ ప్రచారాలతో అలసిపోయిన అభ్యర్థులకు శుక్రవారం కాస్త తీరిక దొరికింది. కౌంటింగ్‌కు రెండు రోజులు సమయం ఉండడంతో కొంతమంది కుటుంబసభ్యులతో గడపగా.. మరికొంతమంది అనుచరులతో సమావేశమై గెలుపు లెక్కలు వేసుకోవడంలో నిమగ్నమయ్యారు.



ఆమనగల్లు: భార్య మాధవిరెడ్డితో కలిసి భోజనం చేస్తున్న కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి



సతీమణి దగ్గరుండి వడ్డిస్తుండగా భోజనం చేస్తున్న బీఆర్ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



చేవెళ్ల: పార్టీ నాయకులు, కార్యకర్తలతో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య



షాద్‌నగర్: టీ తాగుతూ నాయకులతో చర్చిస్తున్న షాద్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్న షాద్‌నగర్ బీజేపీ అభ్యర్థి అందె బాబయ్య



కుటుంబ సభ్యులతో కలిసి టీవీ చూస్తున్న శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ

ఊరెళ్లలో పులి సంచారం పుకార్లు

- ఆందోళనలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



ఊరేళ్ల- మొండివాగు సమీపంలో గుర్తించిన పాదముద్రలు

చేవెళ్ల: మండల పరిధిలో పులి సంచరిస్తోందని, ఓ వ్యక్తి చూశాడని సోషల్ మీడియాలో పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇది నిజమా.. కాదా..? తెలియక మండల ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఊరేళ్ల అనుబంధ గ్రామమైన మొండివాగు సమీపంలో శుక్రవారం రోడ్డుపై పులి కనిపించిందని, కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తాను పులిని చూశానని మరో వ్యక్తికి వాట్సాప్‌లో వాయిస్ మెస్సేజ్ పెట్టాడు. పులి ఎన్కేపల్లి, కమ్మెట గ్రామాల వైపు వెళ్లిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మొండివాగు గ్రామ ప్రజలు పులి కనిపించినట్లు చెప్పిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ కనిపించిన పాద ముద్రలను చూసి.. పులివేనని ప్రచారం చేశారు. దీంతో అందరిలో భయం మొదలైంది. ఈ విషయమై కొంత మంది ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. వారు ఆయా ప్రాంతాలను పరిశీలించారని, ఇసుక దిబ్బలు, మట్టి రోడ్లపై కనిపించిన పాద ముద్రలను సేకరించారని తెలిపారు. కానీ అక్కడ సంచరించినది పులేనా.. కాదా..? అనేది నిర్ధారించలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఎన్కేపల్లి, కమ్మెట, ఊరేళ్ల, దేవునిఎర్రవల్లి, మొండివాగు తదితర గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా పక్కా సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టెంపో

నలుగురికి గాయాలు

శంషాబాద్ రూరల్: ఆర్టీసీ బస్సును వెనక నుంచి టెంపో ట్రావెల్స్ వాహనం ఢీ కొనడంతో ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా డిపో బస్సు శుక్రవారం తెల్లవారుజామున కొండారెడ్డిపల్లి నుంచి బయలుదేరి హైదరాబాద్ వస్తోంది. మార్గ మధ్యలో పెద్దషాపూర్ బస్టాప్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరుతుండగా.. వెనక నుంచి టెంపో వాహనం వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో వెనక సీట్లో కూర్చున్న నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు వెనక భాగం దెబ్బతింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గప్‌చుప్

- పోలింగ్ ముగియడంతో గ్రామాల్లో నిశబ్ద వాతావరణం
- డబ్బు, మందు, బిర్యానీతో నెలరోజుల పాటు సందడి
- వ్యవసాయ పనులను కాదని ప్రచారంలో పాల్గొన్న మహిళలు
- పోలింగ్ అనంతరం నేతల ఫోన్లు స్విచ్ఛాఫ్



ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారి

యాచారం: నిన్నమొన్నటిదాకా ఎన్నికల హడావుడి, ప్రచారాల హోరుతో సందడిగా ఉన్న గ్రామాల్లో పోలింగ్ అనంతరం ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవహించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దాదాపు నెలరోజుల పాటు గ్రామాల్లో సందడి నెలకొంది. వినాయక చవితి, దసరా పండుగలు ఎన్నికల సీజన్‌లోనే రావడం, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రజలను మచ్చిక చేసుకోవడం కోసం విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేశారు. వినాయక చవితి పండుగకు ఆయా గ్రామాల్లో యువజన సంఘాలకు రూ.లక్షల్లో ఖర్చు చేసి వినాయక విగ్రహాలను ఇప్పించారు. అడిగిన వారికి లేదనకుండా రూ.వేలల్లో చందాలు రాసారు. ఇదే అదునంటూ యువత ఆయా రాజకీయ నేతల నుంచి దండిగా డబ్బులు దండుకున్నారు.

రూ.కోట్లలో ఖర్చు..

ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, ఎల్బీనగర్, మహేశ్వరం, షాద్‌నగర్, చేవేళ్ల తదితర నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల నుంచి పోటీచేసిన అభ్యర్థులు పోలింగ్‌కు ముందు వరకు రూ.కోట్లల్లో ఖర్చు చేశారనేది బహిరంగ రహస్యం. దసరా పండుగ రోజైతే రూ.లక్షల్లో ఖర్చు చేసి విందులు ఏర్పాటు చేసి ఓటర్లను మచ్చిక చేసేందుకు యతిన్నించారు. ఎన్నికల సీజన్ కావడంతో పోటీలో నిలిచిన అభ్యర్థులు కూడా గ్రామాల్లో ఎవరు దావత్‌లు అడిగినా కాదనకుండా.. మేకలు, గొర్రెలు, కోళ్ల మాంసంతో పాటు మద్యం దావత్‌లు ఇచ్చారు. గ్రామాల్లో పేరు, పలుకుబడి కలిగి మెజార్టీ ఓట్లను ప్రభావితం చేయగలిగే వ్యక్తులను మచ్చిక చేసుకోవడం కోసం బడా నేతలు వారిని ఉచితంగా తీర్థయాత్రలకు తీసుకెళ్లి తమ వైపు తిప్పుకున్నారు. రూ.లక్షల్లో ఖర్చుచేసి సకల మర్యాదలు చేశారు.

వ్యవసాయపనుల వైపే చూడని మహిళలు..

ఎన్నికల సీజన్‌లో గ్రామాల్లోని మహిళలు వ్యవసాయ పనుల వైపే చూడలేదు. గ్రామాల్లో నిత్యం రెండు, మూడు పార్టీలకు చెందిన పోటీ అభ్యర్థులు ప్రచారం నిర్వహించడంతో మహిళలు ప్రచారంలో పాల్గొనడానికి ఆసక్తి చూపారు. గ్రామాల్లో గంట, రెండుగంటల పాటు నిర్వహించే ప్రచారానికి రూ.300 నుంచి రూ.500 వరకు డబ్బులు ఇవ్వడంతో పాటు మద్యం, బిర్యానీ ప్యాకెట్లు పంచిపెట్టారు అభ్యర్థులు. దీంతో మహిళలు ఎన్నికల ప్రచారంలో రోజుకు రూ.వెయ్యికి పైగానే సంపాదించారు. మహిళలతో పాటు కొన్ని గ్రామాల్లో పురుషులు, వృద్ధులు, యువతీయువకులు కూడా ప్రచారంలో పాల్గొన్నారు.

తెల్లవారేసరికి అంతా గప్‌చుప్..

అయితే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచి గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. శుక్రవారం ఉదయం పలకరించే వారు లేక అయ్యో ఈ రోజు మద్యం లేదా.. ఇక ఇవ్వరా అంటూ అనుకోవడం జరిగింది. రోజూ తెల్లవారేసరికి ఫోన్లు చేసి వచ్చేయండి అంటూ పిలిచే నేతలు శుక్రవారం కనిపించకపోవడంతో ప్రచారంలో పాల్గొనేవారు ఉసూరుమన్నారు. ఆయా పార్టీల ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేసినా స్పందన లేకపోవడంతో ఇకనుంచి ఎవరి పనుల్లో వారు నిమగ్నం కానున్నారు.

సీఐ రఘువీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

డీజీపీకి ఏఆర్ కానిస్టేబుళ్ల ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల విధుల్లో భాగంగా ఏఆర్ కానిస్టేబుల్ యాదగిరిపై లాఠీతో దాడిచేసిన ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అతడి తోటి ఏఆర్ కానిస్టేబుళ్లు గురువారం డీజీపీకి ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 30న జరిగిన మహేశ్వరం నియోజకవర్గంలోని పోలింగ్‌లో భాగంగా నాదర్‌గుల్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములకు గన్‌మెన్‌గా ఉన్న యాదగిరిపై దాడి చేయడంతో పాటు అవమానపర్చిన ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ, మానవ హక్కుల సంఘం, చీఫ్ ఎన్నికల అధికారులకు తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్స్ ఫిర్యాదు చేశారు. రాష్ట్ర పోలీసుల పరువు, ప్రతిష్టకు భంగం కలిగించడమే కాకుండా విధి నిర్వహణలో ఉన్న యాదగిరిపై అకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ విజయం ఖాయం



రేవంత్‌రెడ్డిని సన్మానించిన ఆసిఫ్‌అలీ

కడ్తాల్: రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించనుండం ఖాయమని రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ అన్నారు. 30న జరిగిన పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర ప్రజలు మద్దతుగా నిలిచారని, ఎగ్జిట్‌పోల్ సర్వేలన్నీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రకటించాయని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆసిఫ్ అలీ హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు.

శభాష్ రామకృష్ణారెడ్డి

మత్తు వైద్యుల సంఘం జాతీయకార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక



చేవెళ్ల: మండల కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో మెడికల్ సూపరింటెండెంట్, అనస్తీషియా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి భారతీయ మత్తు వైద్యుల సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన మత్తు వైద్యుల సంఘం జాతీయ ఎన్నికల్లో తాను భారీ మెజార్టీతో గెలిచినట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో తనను జాతీయ ఎన్నికల్లో కార్యవర్గ సభ్యుడిగా గెలిపించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను గతంలో తెలంగాణ రాష్ట్ర స్టేట్ సెక్రటరీగా సేవలు అందించినట్లు తెలిపారు. మత్తు వైద్య సంఘం జాతీయ అవార్డును సైతం అందుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నానని ఇక్కడ ఈప్రాంత ప్రజలకు తనవవంతుగా వైద్య సేవలు అందిస్తానని చెప్పారు.

లారీని ఢీకొట్టిన బైక్

యువకుడి పరిస్థితి విషమం

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయలయ్యాయి. వివరాలు.. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ తండాకు చెందిన బనావత్ రాజు బైక్‌పై వస్తుండగా కొంగరకలాన్ రోడ్డులో మినీలారీని వెనునుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజు తలకు గాయం కావడంతో తీవ్ర రక్త స్రావం అయ్యింది. స్థానికులు అతడిని వెంటనే బ్రంగి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు అపస్మారక స్థితిలో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆదిబట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శంషాబాద్‌లో అత్యధిక పోలింగ్

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో అత్యధికంగా శంషాబాద్ మండలంలో ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలోని 5,81,937 ఓట్లలో శంషాబాద్‌లోని 87,256 ఓట్లలో 63,658 ఓట్లు పోలయ్యాయి. అత్యధికంగా 72.95 ఓట్ల శాతం నమోదైంది. గండిపేట్ మండలంలో 1,79,627 ఓట్లలో 1,00,623 ఓట్లు పోలయ్యాయి. 56.01 శాతం ఓట్లు నమోదు ఉంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో అత్యధికంగా 1,60,636 ఓట్లు పోలు కాగా.. సర్కిల్‌లోని 3,15,054 ఓట్లలో 51 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 55.83 శాతం ఓట్ల పోల్‌తో సర్కిల్ పరిధిలోని మైనార్టీ ఓట్లు ప్రస్తుతం అభ్యర్థుల జయాపజయాలను శాసిస్తున్నాయి.

బావిలో పడి వ్యక్తి మృతి

దోమ: ఓ వ్యక్తి బావిలో పడి మృతి చెందిన సంఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని లింగన్‌పల్లికి చెందిన మైస నరేశ్(27).. గ్రామానికి సమీపంలో ఉన్న ఓ బావిలో శుక్రవారం శవమై తేలాడు. గురువారం జరిగిన ఎలక్షన్‌లో భాగంగా ఓటు వేసిన అనంతరం నేతలు పంచిన మద్యాన్ని సేవించడంతో అదే మత్తులో బావిలోకి దూకి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆ ఓటర్లు.. ఎవరివైపో?

- ఇబ్రహీంపట్నంలో పెరిగిన పోలింగ్
- గత ఎన్నికల కంటే 48,608 ఓట్లు అధికం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 2018 శాసనసభ ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో 2,57,771 ఓటర్లు ఉండగా 1,96,851 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అప్పట్లో బీఎస్పీ నుంచి పోటీచేసిన ఇప్పటి కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 356 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అయితే ఈసారి ఎన్నికల్లో(2023) నియోజకవర్గంలో కొత్తగా చేరిన వారితో ఓటర్ల సంఖ్య 3,27,583కు చేరింది. అందులో 2,45,459 మంది ఈ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి 48,608 ఓట్లు అధికంగా పోలయ్యాయి. అప్పట్లో బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి కేవలం 356 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అయితే ఈ ఎన్నికల్లో పోలింగ్ పెరగడంతో ఫలితం ఏవిధంగా ఉంటుందో అని అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. పెరిగిన ఓటర్లతో ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే అంచనాల్లో ఆయా పార్టీల శ్రేణులున్నారు. ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపులో పెరిగిన ఓటర్లు ఎవరివైపు మొగ్గుచూపారో తేలనుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంషాబాద్ రూరల్: స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు నివాసి బొట్టు రంజిత్(28), సహోద్యోగి అజయ్ కలిసి షాద్‌నగర్‌లోని స్నేహితుడు పుట్టినరోజు వేడుకకు బైక్‌పై నవంబరు 29న వెళ్లారు. 30న తెల్లవారుజామున తిరిగి వస్తుండగా.. తొండుపల్లి రైల్వే వంతెన దాటగానే బెంగళూరు జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న రోడ్డు పనుల వద్ద మట్టి దిబ్బలను వీరి బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రంజిత్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న అజయ్‌కు గాయాలవడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

28 టేబుళ్లు.. 20 రౌండ్లు

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం లార్డ్స్ కళాశాలలో రిటర్నింగ్ అధికారి మల్లయ్య ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లను చేపడుతున్నారు. నియోజకవర్గంలో 542 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను ఇప్పటికే స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలను ఈ స్ట్రాంగ్‌రూమ్ వద్ద 24 గంటల బందోబస్తు ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఓట్ల లెక్కింపు కోసం 28 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం 20 రౌండ్‌లను నిర్ణయించారు. ప్రతి రౌండ్‌లో 28 బూత్‌లకు సంబంధించిన ఓట్లను లెక్కించనున్నారు. ప్రతి రౌండ్ 30-45 నిముషాల సమయం పడుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన తుది ఫలితానికి 8 గంటల సమయం పట్టనుంది. ప్రతి టేబుల్‌లో 28 ఈవీఎంలకు చెందిన ఓట్లను లెక్కించి రౌండ్‌ల వారీగా ప్రకటించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ 3న ఉదయం 7.30 గంటల నుంచి ప్రారంభం కానుంది. నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ బూత్‌లు ఉండటంతో లెక్కింపు ప్రక్రియ ఆలస్యం కానుంది.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలోని పోస్టర్ బ్యాలెట్ల లెక్కింపుకోసం లార్డ్స్ కళాశాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2,209 పోస్టర్ బ్యాలెట్లు అందాయి. వీటితో పాటు వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న వారు పోస్టర్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు శనివారం ఉదయానికి రిటర్నింగ్ అధికారికి చేరనున్నాయి. ప్రస్తుతం స్ట్రాంగ్‌రూమ్‌లో 2,209 ఓట్లను భద్రపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని పోస్టల్ బ్యాలెట్లు రానున్నాయి. దీంతో అధికారులు ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశారు. ఇందులో 500 ఓట్లను లెక్కించేందుకు ఒక టేబుల్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం ఐదు టేబుళ్లను పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి టేబుల్‌పై 500 పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు ఒక సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్ సూపర్‌వైజర్, ఒక ఏఆర్‌ఓతో పాటు సహాయకులను నియమించారు. ఉదయం 7.30 గంటలకు ఈ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది.

చేవెళ్లలో 74.18శాతం పోలింగ్



పోలింగ్ కేంద్రం బయట క్యూలో ఓటర్లు (ఫైల్)

2018 కంటే స్వల్పంగా తగ్గిన ఓటింగ్ శాతం

చేవెళ్ల: చేవెళ్ల నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల కంటే పోలింగ్ శాతం తగ్గడం అభ్యర్థులను కలవరపరుస్తోంది. 2018 కంటే స్వల్పంగా ఓటింగ్ శాతం తగ్గడంతో విజయం ఎవరిని వరిస్తుందోనని అంతా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఇక్కడ 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 78.3 శాతం ఓటింగ్ నమోదుకాగా, 2014లో స్వల్పంగా పెరిగి 78.72 శాతం నమోదైంది. 2018 స్వల్పంగా తగ్గి 78.30 శాతం నమోదైంది. ప్రస్తుతం మరింత తగ్గి 74.18 శాతంగా నమోదైంది.

మండలాలవారీగా ఓటింగ్ శాతం ఇలా..

నియోజకవర్గంలో చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నబాబుపేట మండలాలున్నాయి. అన్నిటిలో కలిపి 2,62,005 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 1,32,631, మహిళలు 1,29,370 మంది ఉన్నారు. ఇతరులు 04మంది ఉన్నారు. గురువారం జరిగిన పోలింగ్‌లో 1,94,343 ఓట్లు పోలయ్యాయి. వీరిలో పురుషులు 99,705, మహిళలు 94,638 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో 74.18శాతం ఓటింగ్ నమోదైంది. మొయినాబాద్‌లో అత్యధికంగా 75.40శాతం నమోదు కాగా చేవెళ్లలో 74.13శాతం, శంకర్‌పల్లిలో 74శాతం, నవాబుపేటలో 73.88 శాతం, షాబాద్లో 73.18 శాతంగా పోలింగ్ నమోదయ్యింది. అతి తక్కువగా శంకర్‌పల్లిలోని పోలింగ్ బూత్ 67లో 52.90శాతం, 66లో 53.43శాతంగా నమొదయ్యింది.

మండలాల వారీగా ఓటింగ్ శాతం

మండలం	ఓటర్లు	పురుషులు	మహిళలు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	శాతం
నవాబుపేట	36,519	18,526	17,993	26,979	13,959	13,020	73.88
శంకర్‌పల్లి	64,341	32,221	32,120	47,620	24,220	23,400	74.01
మొయినాబాద్	57,660	29,417	28,242	43,473	22,534	20,939	75.40
షాబాద్	46,609	23,715	22,893	34,108	17,573	16,535	73.18
చేవెళ్ల	56,876	28,752	28,122	42,163	21,419	20,744	74.13
మొత్తం	26,2005	13,2631	1,29,370	1,94,343	99,705	94,638	74.18

జోరుగా బెట్టింగ్

గెలుపోటములతో పాటు మెజార్టీపై ఆసక్తి

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్ ఊపందుకుంది. గురువారం సాయంత్రం ఓటింగ్ ముగిసిన అనంతరం ఓటింగ్ శాతాన్ని పరిశీలించిన పలువురు తామే గెలుస్తున్నామంటూ.. ఇతర పార్టీలు రెండో, మూడో స్థానంలో నిలుస్తాయంటూ.. బెట్టింగ్‌లను ప్రారంభించారు. గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమైన బెట్టింగ్‌లు శుక్రవారం రాత్రి వరకు ఊపందుకున్నాయి. ప్రజా ప్రతినిధులతో పాటు నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు, చిన్నారులు సైతం బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. బండ్లగూడకు చెందిన ఒక ముఖ్య నాయకుడు తమ పార్టీ గెలుస్తుదంటూ.. లక్షల్లో బేరం ఆడినట్లు సమాచారం. దీనికి సంబంధించిన చెక్కులను సైతం రాసి మధ్యవర్తికి అందించాడు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఈ బెట్టింగ్ ప్రక్రియ జోరుగా సాగుతోంది. తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడంటే.. కాదు తమ పార్టీ అంటూ.. బెట్టింగ్‌లో పాల్గొంటున్నారని వినికిడి.

కనిపించని బెట్టింగ్..

ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం గెలుపోటములపైనే బెట్టింగ్‌లు కాస్తున్నారు. మెజార్టీపై ఏ ఒక్కరూ బెట్టింగ్ కాయడం లేదు. దీనికి గల ముఖ్య కారణం.. నాల్గు పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ఈ ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించారు. ఓటింగ్ శాతం సైతం 55.83 శాతంగా ఉంది. గతంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ 70 వేల మెజార్టీని సాధించారు. ప్రస్తుతం బీజేపీ, మజ్లిస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు గట్టిపోటీ ఇవ్వడంతో మెజార్టీపై ఎవరూ అంతగా బెట్టింగ్ ఖాయడం లేదు. గెలిస్తేచాలన్న దానిపైనే బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. స్వల్ప ఓట్ల తేడాతో అయినా గట్టెక్కితే చాలు దేవుడా అని అభ్యర్థులున్నారు.

టెన్షన్.. టెన్షన్

- ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- గెలుపుపై ధీమాగా ప్రధాన పార్టీల అభ్యర్థులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దశాబ్దాల కాలంగా రాజకీయాల్లో తలపండిన నాయకులే కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి ఇక్కడ మరోసారి బరిలో ఉండటంతో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ టికెట్ లభించని కారణంగా బీఎస్పీ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి తలపడిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో మల్‌రెడ్డి రంగారెడ్డి కేవలం 356 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఈసారి కాంగ్రెస్ టికెట్ దక్కించుకున్న మల్‌రెడ్డి.. బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఢీఅంటేఢీ అనే రీతిలో బరిలో నిలిచారు. అయితే ఇప్పుడు పోలింగ్ ముగియడంతో ఎన్నికల ఫలితాలపై తీవ్రస్థాయిలో చర్చ కొనసాగుతోంది. ఎక్కడ ఎవరు కలిసినా ఎన్నికల ఫలితాలపై మాట్లాడుకుంటున్నారు. కొంతమంది బీఆర్ఎస్ అంటుంటే మరికొంతమంది కాంగ్రెస్ గెలుస్తుందని అంటుండం చర్చనీయాంశంగా మారింది.

బయటకు ధీమాగా ఉన్నా...

ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపుపై బయటకు ధీమా వ్యక్తం చేస్తున్నా...లోలోపల ఓటర్లు ఎవరికి ఓటువేశారో తెలియక తలలుపట్టుకుంటున్నారు. ఈసారి తప్పక విజయం తమనే వరిస్తుందనే ధీమాతో మల్‌రెడ్డి రంగారెడ్డి ఉండగా.. బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను మరోసారి గెలపిస్తాయని ధీమాగా ఉన్నారు. పోలింగ్ సరళిపై ఇరు పార్టీల అభ్యర్థులు తర్జనభర్జనలు పడుతూ కాకి లెక్కలు వేసుకుంటున్నారు.

ఎవరి ఓట్లు చీల్చుతారో....

సీపీఎం, బీజేపీ అభ్యర్థులు ఎవరి ఓట్లు ఎక్కువగా చీల్చుతారో అర్థంకాకుండా ఉంది. నియోజకవర్గంలో సీపీఎం, బీజేపీలు సుమారు 15వేల నుంచి 18వేల వరకు ఓటు బ్యాంకు కలిగిఉన్నాయి. 2018లో బీజేపీ అభ్యర్థికి 17 వేల పైచిలుకు ఓట్లు రాగా.. సీపీఎం అభ్యర్థికి 10వేలకు పైగా ఓట్లు వచ్చాయి. అదేవిధంగా టీడీపీ నుంచి పోటీ చేసిన సామ రంగారెడ్డికి 18వేల పైచిలుకు ఓట్లు పడ్డాయి. ఈసారి ఎన్నికలకు టీడీపీ దూరంగా ఉండటం ఎవరికి కలిసోస్తుందో అంతుచిక్కకుండా ఉంది. వారి ఓట్లు ఏ వైపు, ఏ మేరకు దారి మరిలాయో అర్థంకాని పరిస్థితి. అయితే చాలావరకు బీజేపీ, సీపీఎం పార్టీలకు చెందిన వారు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు సమాచారం.

డబ్బుల ప్రభావం ఏ మేరకో..

ఇదిలాఉంటే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మునుపెన్నడూ లేనివిధంగా డబ్బుల ప్రభావం కనిపించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటుకు ఇంత చొప్పున అని పంపిణీ చేసిన విషయం బహిరంగ రహస్యమే. ఈ డబ్బుల ప్రభావం అభ్యర్థుల గెలుపును ప్రభావితం చేస్తుందా లేదా అనే విషయాన్ని ఫలితాలు వస్తేగాని స్పష్టంగా బయటపడదు. ఏదిఏమైనా ఎన్నికల ఫలితాలను ముందుగా ఊహించి చెప్పడం ఇబ్బందిగా మారింది. ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల జాతకాలు బట్టబయలు కానున్నాయి. అంతవరకు ఓపిక పట్టాల్సిందే.